
జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 7-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 92 పేజీలు: 8 వెల : రూ.7

# రూ.100కు.. రూ.10 వడ్డీ.. ఐపి



* అధిక వడ్డీ చూపి ఆశలు
* ఆ తర్వాత పరార్
* జిల్లాలో చోటుచేసుకుంటున్న ఘరానా మోసాలు
* ఇటీవల పలాసలో వెలుగుచూసిన వైనం
* పోలీసుల నిఘా వైఫల్యం



**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు6 (వార్త):** వందకు పది, ఇరవై రూపాయలు వడ్డీ ఆశచూపి అప్పులు తీసుకుని ఆ తర్వాత పరారవుతున్న ఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి. ఇటువంటి ఘరానా మోసాలు వెలుగుచూస్తున్నా పోలీసులు అటువంటి వారిపై చర్యలు చేపట్టిన దాఖలాలు కూడా లేవు. జిల్లావాసులు మోసపోతున్నారని పత్రికల్లో కథనాలు వస్తున్నా.. కొందరు మాత్రం అధిక వడ్డీ మత్తులో మళ్లీ మళ్లీ అదేబాటలోకి మోసపోతునే ఉన్నారు. పలాస-కాశీబుగ్గలో ఓ ఇద్దరు వ్యక్తులు సుమారు రూ.8.50కోట్లు వరకూ వసూలు చేసి జెండా ఎత్తేశారు. వారిలో ఒకరు పలాసకు చెందిన ఓ వ్యాపారి కుమారుడు ఫుడ్‌కార్పొరేషన్ గోదాములో తాత్కాలిక ఉద్యోగి, కాగా, మరొకరు కాశీబుగ్గలోని ఓ కార్పొరేట్ కళాశాల అధ్యాపకుడు. ప్రస్తుతం వీరిద్దరూ పరారీలోనే ఉన్నారు. మోసపోయిన వారు సైతం వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకురాకపోవడం గమనార్హం. కొందరు వ్యాపారులు ప్రజలతో నమ్మకంగా ఉండి తక్కువ వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. కొందరు నెల రోజులకు, మరికొందరు పక్షం రోజులకు, ఇంకొందరు వారం రోజులకు గాను వడ్డీలకు రూ.వేలల్లో ముందుగా తీసుకుని వారు ఊహించని విధంగా రెట్టింపు వడ్డీలు ఇస్తున్నారు. పూర్తిగా నమ్మకం కలిగిన తరువాత రూ.వేలల్లో ఉన్న అప్పు రూ.లక్షలకు పాకుతోంది. వాటికి కూడా మున్ముందు మంచి వడ్డీలు చెల్లిస్తు.. కాలక్రమేణా అప్పులకు ఎసరు పెట్టేస్తున్నారు. కొందరు అప్పుల బాధ నుంచి తప్పించుకోవడానికి కోర్టు ద్వారా ఐపీలు పెట్టేస్తూ దర్జాగా తిరుగుతున్నారు. మేం లాసయ్యామని, కేసులు పెట్టుకుంటే పెట్టుకోండని చెబుతుండడంతో బాధితులు మోసపోయామని గుర్తించి లబోదిబోమంటున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో రోజువారీ వడ్డీలు అధికంగా సాగుతోంది. కొందరు డబ్బులు పట్టుకుని మార్కెట్లోనే ఉంటారు. రూ.10లు వడ్డీకి నగదును ఇస్తుంటారు. పలువురు వ్యాపారులు సరుకులు దించుకునే సమయంలో పెద్ద ఎత్తున డబ్బులు అవసరం పడుతుంటుంది. వారు కూడా అధిక వడ్డీకి అప్పులు చేస్తుంటారు. మార్కెట్లో వ్యాపారం చేసే వారు బయట వారి నుంచి అప్పు తీసుకునే వీలుండదు. కొందరు బంగారు వ్యాపారులది కూడా ఇదే పరిస్థితి. వారు సైతం రూ.10, రూ.20లకు వడ్డీలకు అప్పులు చేస్తుంటారని వినికిడి. దీనికి వేలం పాట కూడా ఉంటుంది. బంగారం వ్యాపారులకు అప్పులు ఇవ్వడానికి కొందరు పోటీ పడుతుంటారు. వారు సిండికేట్ అయి ఈ వ్యాపారం సాగిస్తున్నారు. బంగారం వ్యాపారులు సైతం వీరి వద్ద తప్ప మిగతా వారి వద్ద నుంచి అప్పు తీసుకోవడానికి వీల్లేదు. నరసన్నపేట బంగారు వ్యాపారుల సిండికేట్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. పలు పెట్రోల్ బంకుల యజమానులు వారం ఇంట్రస్టులను వాడుతుంటారని భోగట్టా. ఇకనైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్న వారిపై నిఘా పెట్టడమే గాకుండా అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటే జరిగే పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అరసవల్లిని అభివృద్ధి చేస్తా

* మౌలిక సౌకర్యాల కల్పనకి చర్యలు తీసుకుంటా
* అరసవల్లి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం, ఆగస్టు 6 (నేడు న్యూస్):** అరసవల్లి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి అరసవల్లి పరిసర ప్రాంతాలతో పాటు ఖాజీపేట, కొయ్యాన కన్నయ్యకాలనీ, ఆదిత్యనగర్, బొంపాడ వీధి తదితర ప్రాంతాలలో కలియదిరిగారు. రోడ్లు, డ్రైనేజీలు, స్మశాన వాటిక, ట్రాఫిక్ సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. అరసవల్లికి వచ్చే భక్తుల సంఖ్య పెరగడం వల్ల ఆదివారాలు, అలాగే ఉత్సవాలు జరిగే రోజులలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకి తెలియజేశారు. అరసవల్లిలోని అసిరితల్లి ఆలయం ఎదురుగా ఉన్న లక్ష్మీనగర్ కాలనీ, ఆదిత్యనగర్ కాలనీలను అనుసంధానం చేసేలా రహదారిని ఏర్పాటు చేస్తే ఆ మార్గంలో గర్ల్స్ హైస్కూల్ వరకూ వెళ్లే చాన్స్ ఉంటుందని ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన వెంటనే కమిషనర్ ఇతర కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గెడ్డ మీద వంతెన నిర్మిస్తే రాకపోకలకు మార్గం సుగమమవుతుందని గుర్తించి ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకో వాలని ఎమ్మెల్యే శంకర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు ఉంగటీ వెంకట రమణ, రాయిపిల్లి అర్జున్, నాగరత్నం, తాతబాబు, సుధీర్, అరసవల్లి గ్రామ ప్రజలు భైరి రామకృష్ణ, రుప్ప లక్ష్మణ్, పంకు మురళి, సీడి పవన్, ముద్దాడ జయంత్, దుప్పాడ ఆశిష్, అరుణ కుమారి, ఉదయ్ కుమార్, కింజరాపు రామకృష్ణ, కళ్లేపల్లి ఆది, జామాన చాణక్య, సూరిబాబు, బాలు, సీహెచ్ సుశీల పాల్గొన్నారు.



## మద్యం షాపు కేటాయింపులలో రిజర్వేషన్ కల్పించాలి

**టెక్కలి, ఆగస్టు 6(వార్త):** గౌడ, శెట్టి బలిజ, ఈడిగ సామాజిక వర్గాల వారికి కొత్త మద్యం దుకాణాల పాలసీలో 15 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో ప్రకటించడం పట్ల టెక్కలి సొండికుల ప్రధాన కార్యదర్శి జి నాగభూషణం మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. కులవృత్తి కోల్పోయిన సొండి కులస్తులకు నూతన అబ్కారి విధానంలో మద్యం షాపులు కేటాయింపులలో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. తమ కులవృత్తి ప్రభుత్వం తీసుకున్న తర్వాత వృత్తిపరంగా ఎలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేక నానా దుర్భరమైన జీవితాలను గడుపుతున్నట్లు తెలిపారు. తమ కులం లక్ష జనాభా కలిగి ఉన్నప్పటికీ గత ప్రభుత్వంచే కుల వివక్షతకు గురైనట్లు, రాజకీయంగా ఆర్థికంగా భాషాపరంగా చాలా వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఉత్తరాంధ్ర ఎలక్షన్స్ పర్యటనలో భాగంగా పార్వతీపురం బహిరంగ సభలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గౌడ కులస్తులు మాదిరిగా సొండి కులస్తులకు న్యాయం చేసి మద్యం దుకాణాలలో రిజర్వేషన్స్ కల్పించనున్నట్లు హామీ ఇచ్చారన్నారు. రానున్న నూతన అబ్కారీ విధానంలో సొండి కులస్తులకు మద్యం దుకాణాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

# జీడికి మద్దతు ధర ప్రకటించండి

***పలాసలో జీడి బోర్డు ఏర్పాటు చేయాలి * కేంద్ర పంటల జాబితాలో జీడిని చేర్చాలి * ఎమ్మెల్యే శిరీషను కోరిన జీడి రైతు సంఘం నాయకులు**



**పలాస, ఆగస్టు 6(వార్త):** జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి, రైతు సేవా కేంద్రాల ద్వారా 80 కేజీల బస్తా రూ.16 వేలుకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో జీడి రైతుల సంఘం నాయకులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిసి జీడి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జీడిపై ఇచ్చిన హామీలను త్వరగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పలాస కేంద్రంగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని, బ్యాంకుల ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జీడి రైతాంగానికి అమలు చేయాలని కోరారు. జీడి పిక్కలు కొనుగోలు అనంతరం విదేశీ పిక్కలకు అనుమతించాలని కోరారు. జీడి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు,



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో చర్చలు జరిపి కేంద్ర పంటల జాబితాలో జీడి పంటను చేర్పించుటకు కృషి చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందిస్తూ జీడి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో జీడి రైతు సంఘం నాయకులు కుత్తుం వినోద్ కుమార్, నెయ్యల గణపతి, కోనేరు రమేష్, తమ్మినాన భాస్కర్, మద్దు రాఘవరావు, సూరాడ మోహనరావు, అంబటి రామకృష్ణ, బత్తిని లక్ష్మీనారాయణ, ఎంపల్ల జోగారావు, బీఆర్ కె నాయుడు, దాసరి తాతారావు, దాసరి మోహనరావు, పుక్కల్ల తాతారావు, అర్లి దానేషు, జి.నీలకంఠం, బి రామకృష్ణ, తదితర రైతులు పాల్గొన్నారు.

### కిడ్నీ పరిశోధన కేంద్రంపై ఆరా

పలాస నియోజకవర్గ కేంద్రంలోని కిడ్నీ పరిశోధన కేంద్రం ఏర్పాటైన ఆ నిర్మాణం డయాలసిస్ సెంటర్‌గా పనిచేస్తుందా? లేక పరిశోధన కేంద్రంగా పనిచేస్తుందా అని అధికారుల నుంచి ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరా తీశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమెను ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిర్మాణానికి రూ.53 కోట్లు మంజూరయ్యాయని, రూ.25 కోట్ల విలువైన అధునాతన సాంకేతిక పరికరాలను ఏర్పాటుచేయాల్సి ఉండగా, కేవలం రూ.14 కోట్ల ఎక్విప్‌మెంట్ మాత్రమే గత ప్రభుత్వం అందించిందని వివరించారు. పూర్తిస్థాయిలో కిడ్నీ పరిశోధన కేంద్రానికి కావలసిన ఎక్విప్‌మెంట్ అక్కడ లేదని వివరించారు. 2014-2019 వరకున్న కూటమి ప్రభుత్వానికి జనసేనాని, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని సిఫారసు చేశారని, అందుకు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్పందించి, పలాసలో నిర్మాణం చేపట్టేందుకు భూ సమీకరణ చేపట్టి.. శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. అయితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ నిర్మాణం మాత్రమే చేపట్టి... అభివృద్ధి చేశామని కలరింగ్ ఇచ్చిందే తప్ప, అవసరమైన మేరకు పరికరాలు లేకుండానే అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డితో ఆదరాబాదరగా ప్రారంభోత్సవాలు చేపట్టారని విస్మయం వ్యక్తం చేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలసినవారిలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్యప్రభాకర్, డీఈఈ త్రిమూర్తులు, జేఈలు నరేంద్ర, ధనుంజయ, సాయిసురేంద్ర, బీఎంఈ దామోదరరావు, తదితరులున్నారు.

# 1/70 చట్టం అమలు చేయాలి

***ఏఐకెఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు * రింపి గ్రామంలో ర్యాలీ**

**మెళియాపుట్టి, ఆగస్టు 6 (వార్త):** జిల్లాలో ఆదివాసి గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చబడలేదని, ఐదు దశాబ్దాలుగా అఖిల భారత రైతుకూలీ సంఘం, విప్లవ పార్టీల నాయకత్వంలో ఆదివాసి సంఘాలు 5వ షెడ్యూల్ సాధన కోసం అవిరామంగా పోరాడుతున్నాయని, 1/70 చట్టాన్ని అమలు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంకల మాధవరావు అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండలం రింపి గ్రామంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అడవులను రక్షించుకునే క్రమంలో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి పోరాడాలన్నారు. అంతులేని లాభాపేక్షతో కార్పొరేటర్లకు అడవులు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నారని, కార్పొరేటర్ల లాభాల కోసమే అటవీ సంరక్షణ నియమాలు, చట్టాలు తెచ్చారని విమర్శించారు. 2023 అటవీ నియమాల, సంరక్షణ చట్టాన్ని తీసుకువచ్చారని, మితిమీరిన లాభాల కోసం అడవుల్లో దొరుకుతున్న ఖనిజాల కోసం ఆదివాసీలపైన నిరంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు చేస్తున్నాయన్నారు. అటవీ సంరక్షణ చట్టం 1980 సవరించి ఆదివాసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసి గ్రామాలకు రహదారుల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ఒక తంతులాగా మార్చారన్నారు. ఐక్యరాజ్యసమితి ఆదివాసుల హక్కులు వారు సమస్యలు ఆయా దేశాలు గుర్తించి పరిష్కారాన్ని కృషి చేయాలని పిలుపునిస్తే దానికి భిన్నంగా భారతదేశంలో జరుగుతుందని విమర్శించారు అనంతరం జరిగిన ర్యాలీలో స్థానిక సర్పంచ్ గొందర గౌరీశ్, పి ఓ డబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి ప్రభ, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్షుడు సవర శ్రీను, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భాస్కరరావు, లక్ష్మణ్, పోలయ్య, రామారావు, వెంకట్రావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.






## కిల్లంశెట్టి దాతృత్వం..
# అందరికీ ఆదర్శం

*** రూ.1.10లక్షలు విద్యాలయానికి సాయం**

**మందస, ఆగస్టు 6 (వార్త):** శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.. ఎంతో అదృష్టం చేసుకుంది. శ్రీనివాసరాజమణిదేవ్ పరిపాలన ఎంతోముందు చూపుతో మందస పట్టణంలో సుమారు 125 ఏళ్ల కిందట ఓ విద్యాలయం నిర్మించారు. ముందు భాగంతో రాజుల హయాంలో నిర్మించిన ఆనవాళ్లు ఎంతో చక్కగా కనిపిస్తాయి. ప్రస్తుతం ఆ ఐకానిక్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామపెద్దలు కమిటీగా ఏర్పడి, పునః నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఓ ముహూర్తాన ఈ మంచి కార్యక్రమంలో ప్రారంభించారో కానీ.. పూర్వ విద్యార్థులు, దాతలు సాయం అందిస్తునే ఉన్నారు. ప్రభుత్వంపై ఆధార పడక, మేము ఉన్నామంటూ ఆర్థిక సాయం చేస్తున్నారు. మందస పట్టణానికి చెందిన కిల్లంశెట్టి సీతారాం 1955వ సంవత్సరంలో ఎస్ఎస్ఎల్సీ చదువుకున్నారు. పాఠశాల పరిస్థితిని చూసిన సీతారాం, పుష్పవతి దంపతులు చలించిపోయారు. పాఠశాల పునఃనిర్మాణానికి తమ వంతు సాయంగా లక్ష రూపాయలను కమిటీకి అందజేశారు. సీతారాం కుమారుడు 1985వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకోగా.. శ్రీనివాస, శ్రీలత దంపతులు రూ.10వేలును సాయం అందించారు.



## జీవో117ను రద్దు చేయాలి

**పలాస, ఆగస్టు 6(వార్త):** వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా ప్రభుత్వ విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టుకుపోయిందని, ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయిపోయాయని ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పలు అంశాలను వివరిస్తూ స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందజేశారు. జీవో 117 రద్దు చేయాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు. హైస్కూల్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి పనిభారం తగ్గించాలని కోరారు. హైస్కూల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటర్ పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితుల రీత్యా మధ్యాహ్న భోజన పథకం మెనూ సవరించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్ గ్రేడ్ చేయాలనీ, ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేయాలనీ కోరారు. మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని, గిరిజన ప్రాంతాల్లో ప్లస్ టూ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్లను, భాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని కోరారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలని, ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. మినిమమ్ టైం స్కేల్ ఉపాధ్యాయుల సర్వీస్‌లను రెగ్యులరైజ్ చేయాలని, ప్లస్ టూ పాఠశాలల్లో పిజిటి పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో పి. నాగేశ్వరరావు, జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వి.చలం, కార్యదర్శి కే. రామారావు, ఎల్.ఢిల్లీరావు, జి.మధు, పలాస అధ్యక్షుడు సిద్దు, కార్యదర్శి ఎస్.వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.చిట్టిబాబు, జి.కోదండరావు, కె.జయరాం, జిల్లా కార్యదర్శి జి.రమేష్ మందన అధ్యక్షా కార్యదర్శులు బి.జగదీశ్, డి. ఈశ్వరరావు, పి.జగన్మోహన్రావు, కొండలరావు, ఎం.రాము, డి.మాధవరావు, ఎస్.ప్రేమ్ కుమార్, డి. ఈశ్వరరావు, కే.శ్రీనివాసరావు, ఎస్. రామారావు, సిహెచ్.చంద్రశేఖర్, టి.శ్రీనివాస్, టి.అప్పారావు, కె.పాపారావు, తదితరులున్నారు.

## మొక్కలతోనే మానవ మనుగడ




**పలాస, ఆగస్టు 6(వార్త):** శ్రీసత్యసాయి విద్యావిహార్ రామకృష్ణపురములో ప్రేమతరూ ఇంఛార్చ్ చంద్రమౌళి పర్యవేక్షణలో 36 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవితరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే మొక్కలను విరివిరిగా పెంచాలని కోరారు. పర్యావరణానికి పెనుముప్పు ఉందని, మొక్కలు నాటడం ద్వారా ముప్పు తొలగించవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాళాసు శ్రీను ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు.. కల్పన, కళ్యాణి, సునీత, లలిత, మమత, జయదేవ్ లు పాల్గొన్నారు.

## 474 రోజుకు.. అన్నక్యాంటీన్

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 6 (వార్త):** పేదవాడికి పట్టెడన్నం పెట్టి ఆకలితో ఉన్న కడుపును నింపాలన్న కృతనిశ్చయంతో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించిన అన్నక్యాంటీన్ మంగళవారం నాటికి 474 రోజులు చేరుకుంది. నగరంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన నిరుపేదలు, నిరాశ్రయులు, కూలీలు అన్న క్యాంటీన్‌లో భోజనం చేసి కడుపు నింపుకుంటున్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లో నగరంలోని నిరాశ్రయులు, నిరుపేదలు, కూలీలు రూ.5 చెల్లించి కడుపారా భోజనాన్ని తినేవారు. అటు తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్‌ను నిలుపుదల చేసి పేదవాడి కడుపుపై కొట్టారు. దీంతో కడుపు మండిన పేదవారు తన ఓటుతో వైసీపీని పాతాళానికి తొక్కేశారు. ఎమ్మెల్యే శంకర్ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో కడుపునింపుకున్న ప్రతి పేదవాడు ఆకలి తీర్చుకుని అన్నదాత సుఖీభవ అంటూ గొండు శంకర్‌ను దీవిస్తున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

**నరసన్నపేట, ఆగస్టు 6 (వార్త):** జమ్ము పంచాయతీ పరిధిలోని రావాడపేట వద్ద చేపట్టిన గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలని ఎంపీడీవో జీ రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం స్థానిక లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. సుమారు 190 మందికి పైగా ఇంకా గృహ నిర్మాణాలు ప్రారంభించలేదని గుర్తించారు. వారికి ఆర్థికపరంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అన్న విషయాలపై అధికారులు ఆరా తీసి గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని సూచించారు.

### డబ్బులు చెల్లించకపోతే..

# మరణమే శరణ్యం

* సహారా బాధితులు, ఏజెంట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బైపల్లి సత్యరాజు

**పలాస, ఆగస్టు 6(వార్త):** సుప్రీం కోర్టు సహారా డబ్బులను ఖాతాదారులకు చెల్లించాలని ఆదేశాలు జారీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, తక్షణమే సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసి సహారా డబ్బులను ఖాతాదారులకు జమ చేయాలని సహారా బాధితులు ఏజెంట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బైపల్లి సత్యరాజు డిమాండ్ చేశారు. సహారా డబ్బులను చెల్లించకపోతే స్వచ్ఛంద మరణాలు చేసుకుంటామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. కాశీబుగ్గ సహారా కార్యాలయం వద్ద మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 12 ఏళ్లుగా సహారా సంస్థ చేసిన దారుణానికి సామాన్యులైన ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏజెంట్లుగా తాము గ్రామాల్లో తిరగలేకపోతున్నామని, కట్టిన డబ్బులు తమకు ఇవ్వాలని ఖాతాదారులు మా ఇళ్ల వద్దకు వచ్చి ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 13 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారని, 2023 జూలై నెలలో సుప్రీం కోర్ట్ ఖాతాదారులు చెల్లించిన డబ్బులకు 15శాతం కలిపి డబ్బులు చెల్లించాలని ఆదేశించి ఏడాది కావస్తున్నా సహార సంస్థ పంపిణీ చేయలేదన్నారు. కోర్ట్ ఆదేశాలతో 5000 కోట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసిన సహార సంస్థ డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులు



గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సహార సంస్థకు ఉన్న ఆస్తులు డబ్బులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దేశంలో ఉన్న ప్రతి ఖాతాదారులకు డబ్బులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సహార సంస్థ చేసిన అన్యాయానికి సామాన్యులైన ఖాతాదారులు బలైపోతున్నారని వాపోయారు. సహారా ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్లో సహారా సంస్థ ఖాతాదారుల వివరాలను ఇవ్వడంలేదని చెప్తుతుండడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే సహారా ఖాతాదారులకు న్యాయం జరగడం లేదన్నారు. ఖాతాదారులకు న్యాయం చేయాలని అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు ఎమ్మెల్యేలకు విన్నవించిన ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి సహారా ఖాతాదారులకు న్యాయం చేయకపోతే ఉద్యమాలను ఉధృతం చేసి రోడ్లపైకి వచ్చి ధర్నాలు రాస్తారోకాలు చేయడం జరుగుతుందని ప్రభుత్వానికి హెచ్చరించారు. సమావేశంలో చింతాడ మాధవరావు, కాశీ విశ్వనాథం రాంచరణ్, రూప్ సుందర్, కే కే విశ్వనాథం, గుడ్ల చంద్రమౌళి, డోకి సూర్యారావు, శ్రీనివాస్, ధనరాజ్, ధర్మారావు, షణ్ముఖరావు, సిహెచ్ లోకేశ్వరరావు, ఎస్ఎస్ సుందర రావు, ఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

**కొత్తూరు, ఆగస్టు 6 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు వేతనాలు తక్షనం చెల్లించాలని ఎ.పి.వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేశారు. మంగళవారం గొట్టిపల్లి పంచాయతీ సచివాలయం ఆవరణలో ఖాళీ కంచాలతో వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సచివాలయం వెల్ఫేర్ అధికారి లక్ష్మీ కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన ప్రతీ ఉపాధి కూలీలకు కనీసం ఎనిమిది వారాల బిల్లులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పనిచేసిన పదిహేను రోజుల్లో కూలీలకు వేతనాలు చెల్లించాలని చట్టం చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని లేకుంటే ఉపాధి హామీ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామారావు, లక్ష్మీ, శివ, వెంకటరావు, గణపతి, రమణ పాల్గొన్నారు.

## వరి నాటు యంత్రంతో అధిక దిగుబడులు



**మందస, ఆగస్టు 6 (వార్త):** వరి నాటు యంత్రంతో నాట్లు వెయ్యడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యయసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ లింగాల వెంకట మధు అన్నారు. బిన్నలమదనాపురం గ్రామంలో మార్పు విక్రమ్ అనే యువ రైతు గత కొన్ని సంవత్సరాలుగా వరినాట్లను యంత్రం ద్వారా వేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ సందర్భంగా వరి నాటే యంత్రం పనితీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం మధు మాట్లాడుతూ ఈ యంత్రంతో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. లేత నారు కుదులుకి 2 లేదా 3 మొక్కలను సమాన దూరంలో నాటడం వల్ల పొలంలో సరైన సాంద్రత ఉండి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కుదురుకు రెండు లేదా మూడు మొక్కలు ఉండటంతో గాలి, వెలుతురు బాగా సోకి పిలకలను పెదుతుందన్నారు. తెగులు రాకుండా నివారించవచ్చున్నారు. ఆయా కారణాలతో అధిక దిగుబడి సాధించవచ్చును. మార్పు విక్రమ్ ఆధునిక వ్యవసాయ పద్ధతిని పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో ఏఈఓ బల్లు జగ్గారావు, సిబ్బంది ప్రేమకుమార్, పావని, హేమలత, రేఖన, తులసి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

**మందస, ఆగస్టు6 (వార్త):** పుట్టిన ప్రతీ బిడ్డ తల్లిపాల ద్వారానే ఆరోగ్య వంతంగా ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.వసుంధరాదేవి అన్నారు. మందస మండలంలోని కిల్లోయి సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఓ వసుంధరాదేవి మాట్లాడుతూ తల్లిపాలలోని అన్నిరకాల పోషక పదార్థాలు, ప్రొటీన్లు ఉంటాయన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లి ముర్రుపాలు బిడ్డకు సంజీవని వంటిదని తెలిపారు. తల్లి ముర్రుపాలులో బిడ్డకు కావలసిన పోషక విలువలు సమృద్ధిగా ఉంటాయన్నారు. బిడ్డకు తల్లి పాలే ముద్దని, డబ్బాపాలు వద్దని తల్లులకు అవగాహన హితవు పలికారు. డబ్బా పాలు కంటే తల్లిపాలే బిడ్డకు సులభంగా జీర్ణం అవుతాయన్నారు. బిడ్డకు రోజుకు 8 నుంచి 10 సార్లు తల్లి బిడ్డకు పాలు పట్టాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జయలక్ష్మి, మంగమ్మ, రామలక్ష్మి, గ్రామపెద్దలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

* జిల్లా పోలీసు అధికారులు
* విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు




**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 6 (వార్త):** జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో సైబర్ క్రైం, మైనర్ డ్రైవింగ్, తదితర అంశాలపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఇతర పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు , మైనర్ డ్రైవింగ్స్ వల్ల అనర్థాలపై వివరించారు. రోజురోజుకీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. లైసెన్సులు లేని




డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్ వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు పెట్టడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చదువుకున్న వయసులో మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 'మత్తు పదార్థాలతో జీవితాలు చిన్నాభిన్నం'

**ఆమదాలవలస, ఆగస్టు 6(వార్త):** మత్తు పదార్థాలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని సీఐ దివాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడంతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తుపదార్థాలు జీవితాలను సర్వ నాశనం చేస్తాయని, చదువుకునే వయసులో చెడు వ్యసనాలకు లోను కావద్దని కోరారు. 18 సంవత్సరాలు నిండని వారు, లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదని హెచ్చరించారు.మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్ర ˇమంలో ఎస్ఐ కె.వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# అధ్వానంగా రహదారి

నరసన్నపేట, ఆగస్టు 6 (వార్త): నరసన్నపేటలోని గొట్టిపల్లి సమీపంలోని విజయలక్ష్మి నగర్‌కు వెళ్లాలంటే ఫీట్లు తప్పడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. మట్టిని తరలించే ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అక్కడి వాసులు కోరుతున్నారు.

# వితంతు పింఛను పథకంపై అవగాహన






టెక్కలి, ఆగస్టు 6 (వార్త): వితంతువులు వారి కోసం రూపొందించిన పింఛను పథకంపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి మల్ల తెలిపారు.

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, శ్రీకాకుళం వారి ఆదేశాలు మేరకు మంగళవారం టెక్కలిలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వితంతు పింఛను దారులు, వితంతు పింఛన్‌కి అర్హులైన వారితో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతుపింఛన్ పొందడానికి గల అర్హతులు, ఎలా దరఖాస్తు చేయాలి, ఏ పత్రాలు సమర్పించాలి తదితర విషయాలపై వితంతువులకు అవగాహన కల్పించారు. సదస్సులో టెక్కలి ఎంపీడీవో కె.విజయలక్ష్మి, ఏవో హెచ్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



నరసన్నపేట, ఆగస్టు 6 (వార్త): రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి సునీత పిలుపునిచ్చారు. నరసన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో నేరుగా రైతులు వద్దకే వెళ్లి వారి పంట పొలాల్లో ఈ క్రాప్ నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా రైతులు తమకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

**మెళియాపుట్టి :** ఖరీఫ్‌లో వివిధ పంటల పండించే ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ హనుమంతరావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి దానకర్ణుడు ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈక్రాప్ పంట నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈక్రాప్ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు గ్రామస్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలకు సహకరించి ఈక్రాప్ పంట ప్రక్రియ సెప్టెంబర్ 15లోగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈక్రాప్ నమోదు ప్రక్రియకు సంబంధించి చేపట్టాల్సిన వివిధ అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం

నరసన్నపేట, ఆగస్టు 6(వార్త): నరసన్నపేట మండలంలోని జమ్ము పంచాయతీ పరిధిలో రావాడపేట వద్ద చేపట్టిన గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలని ఎంపీడీవో జి.రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక లేఅవుట్‌ను పరిశీలించారు. సుమారు 190 మందికి పైగా ఇంకా గృహ నిర్మాణాలు ప్రారంభించలేదని గుర్తించామని తెలిపారు. వారికి ఆర్థికపరంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అన్న విషయాలపై అధికారులు ఆరా తీయాలని పేర్కొన్నారు. ఆయన వెంట మండల అధికారులు ఉన్నారు.

# మత్తు పదార్థాలను నియంత్రించాలి



నరసన్నపేట, ఆగస్టు 6(వార్త): మాదక ద్రవ్యాల వ్యాపారంపై చర్యలు తీసు కోవాలని డాక్టర్ గొలివి మోహన్ అన్నారు. మంగళవారం నరసన్నపేట జ్ఞాన జ్యోతి కళాశాలలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మాదక ద్రవ్యా లపై చర్యలు, నియంత్రణ అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు చేపట్టిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా విద్యార్థుల జీవితాలు ఛిన్నా భిన్నవుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధులపై ఆశ వర్కర్లు దృష్టి సారించాలి

**నరసన్నపేట, ఆగస్టు 6 (వార్త):** నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర పీహెచ్ఎన్ సూర్యకాంతం మాట్లాడుతూ.. గ్రామాలలో వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని వాటిపై ఆశ వర్కర్లు దృష్టి సారించాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు పూర్తి సమాచారాన్ని ఆరోగ్య కేంద్రానికి తెలియజేయాలని సూచించారు. ఆరోగ్య రీత్యా ఇబ్బందులు పడుతున్న వారికి మందులు అందజేయాలని కోరారు.



## 'ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి'



జలుమూరు, ఆగస్టు 6 (వార్త): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జలుమూరు ఎస్ఐ మధుసూదనరావు సూచించారు. మంగళవారం ఆయన చల్లవానిపేట జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాలను తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో రక్షణ పొందవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే అపరాధ రుసుము వసూలు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

## పలు కుటుంబాలకు కలమట పరామర్శ



కొత్తూరు, ఆగస్టు 6(వార్త): కొత్తూరు, మెళియాపుట్టి మండలాలకు చెందిన టీడీపీ నేతల కుటుంబాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మంగళవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఊర్లన కృష్ణారావు, ఊర్లన విశ్వనాథంను పరామర్శించి, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఊర్లన కోదండరావు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కొత్తూరు మండలం కుద్దిగం గ్రామానికి చెందిన రఘుమండ సోమేశ్వరరావు మామ సురవరపు వెంకన్న గారు ఇటీవల మరణించడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

## బిడ్డలకు ముర్రు పాలతో రోగ నిరోధకశక్తి



నరసన్నపేట, ఆగస్టు 6(వార్త): నవజాతి శిశువులకు ముర్రుపాలు పట్టడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అరవింద, సుజాత అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలు ఆవశ్యకతపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు. తల్లిపాలు తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు వివరించాలని సూచించారు.

## తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు



నరసన్నపేట, ఆగస్టు 6 (వార్త): నరసన్నపేట మండల తహసీల్దార్ సత్యనారాయణను నరసన్నపేట పట్టణ టీడీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరసన్నపేటలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లి కృష్ణబాబు, కోరాడ రామచంద్రరావు, సరిపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పర్యావరణ రక్షణ మనందరి లక్ష్యం



సారవకోట, ఆగస్టు 6 (వార్త): ప్రయాణాల్లో సురక్షితంగా జాగ్రత్తలు పాటించడంతో పాటు పర్యావరణ రక్షణ కూడా చేపట్టాలని సుప్రియ దాస్ పేర్కొన్నారు. 19 రాష్ట్రాల్లో సైకిల్ యాత్రను చేపట్టిన ఆయన సారవకోట మండలం మాలువ జంక్షన్ వద్ద మంగళవారం జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బగ్గు సుగుణమ్మకు ఆయన తారసపడ్డారు. ఈ సందర్భంగా ఆమె ఆయనకు అభినందనలు తెలియజేశారు. ప్రయాణంలో కావాల్సిన ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఈ యాత్ర విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు.

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

■ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



గార, ఆగస్టు 6(వార్త): అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని, ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. గార మండలం సిమ్మపేటజంక్షన్ కళ్యాణ మండపంలో మంగళవారం మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు, మండల, గ్రామస్థాయి బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వివిధ సమస్యలతో వచ్చేవారికి పరిష్కారం చూపే దిశగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆరోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ నిధులను కైంకర్యం చేయడంతో గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు మరో ముప్పై ఏళ్లు వెనక్కి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి నీటి, కాలువలు, విద్యుత్తు వంటి కనీసం మౌలిక సదుపాయాలను కూడా అందజేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తిస్థాయి దృష్టి సారించామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టినట్లు వివరించారు. అడపాదడపా వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కావున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఐదేళ్లుగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజాసేవలో అంకితం కావాలని కోరారు. ఏ గ్రామానికి వెళ్లినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల అవసరాలను గుర్తించి వాటిని ప్రాధాన్యతలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## శాసనమండలి చైర్మన్‌కి ఘన స్వాగతం

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(వార్త): శాసనమండలి చైర్మన్ కొయ్య మోషేన్‌రాజు మంగళవారం ఇచ్ఛాపురం విచ్చేశారు. ఆ సందర్భంగా ఆయనకు నియోజకవర్గ వైసీపీ నేతలు సాదరంగా స్వాగతం పలికారు. అంపురం జంక్షన్ వద్ద సన్మానించారు. మండలంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్‌యాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్‌యాదవ్, నీలాపు సారథిరెడ్డి, ఇసురు పరశురామ్‌రెడ్డి, పిట్ట బాలరాజు రెడ్డి, మరడ వలసయ్య, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.



## పోలాకిలో తల్లిపాల వారోత్సవాలు

పోలాకి, ఆగస్టు 6(వార్త): పోలాకి పీహెచ్‌సీ ప్రాంగణంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో డా.నల్లి రవికుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి వారి పర్యవేక్షణలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి బిడ్డకు చేరి వివిధ వ్యాధులు రాకుండా కాపాడతాయని తెలిపారు.

# రోగాల బారిన చీడివలస

● మూడేళ్ల నుంచి ఫాగింగ్ యంత్రాన్ని ఉపయోగించని సచివాలయ సిబ్బంది ● మండిపడ్డ ఈవోపీఆర్డీ విజయలక్ష్మి





బూర్జ ఆగస్టు 6(వార్త): చీడివలస గ్రామంలో పారిశుధ్య లోపంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానిక టీడీపీ నేత పిల్లా కన్నంనాయుడు ఫిర్యాదు మేరకు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా మందులు అందజేసి, చేతులు దులుపుకున్నారు. సర్కారు దవాఖానాలో రక్త పరీక్షలు నిర్వహించే నాథుడే లేడంటే ఉన్నత వైద్యాధికారుల పనితీరుకు నిదర్శనం. సామాన్యులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా అభివర్ణించవచ్చు. ఇలావైద్య ఆరోగ్య సిబ్బంది తీరు ఒక ఎత్తైతే గ్రామ సచివాలయ సిబ్బంది తీరు మరో ఎత్తు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, ఖాళీ స్థలాల యజమానులు పిచ్చి మొక్కలు నీటి నిల్వలపై దృష్టి సారించకపోవడంతో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు గ్రామంలో అధికంగా కనిపిస్తున్నాయి. దీనంతటికీ మూలం స్థానిక సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం. మూడేళ్లుగా గ్రామంలో దోమల నివారణకు ఎటువంటి చర్యలూ చేపట్టక పోవడం, ఫాగింగ్ మెషీన్ ఉన్నా వాడడం లేదు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ విషయాలపై స్థానిక నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి మంగళవారం గ్రామాన్ని సందర్శించి సచివాలయ సిబ్బంది తీరుపై మండిపడ్డారు. పరిసరాల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న సీఐ, ఎస్ఐ

## ర్యాగింగ్‌కి పాల్పడవద్దు

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(వార్త): ర్యాగింగ్‌కి పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐ టి.ఇమ్మాన్యుయేల్‌రాజు విద్యార్థులకు హితవు పలికారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. సీనియర్లు ర్యాగింగ్ విష సంస్కృతితో జూనియర్లను హేళన చేయడంతో సున్నిత మనసత్వం కలిగిన విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ వెన్ను సత్యనారాయణ, బారువ, కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మహేష్, జగదీష్, పూర్వపు ప్రిన్సిపాళ్లు రజనీకుమారి, నవ్యశ్రీ మహంతి, ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(వార్త): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు దక్కత విశ్వనాథ రెడ్డి అన్నారు. మంగళవారం యూ కాంప్లెక్స్ సమీపంలో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రసాదరావు, నారాయణ, సోమేశ్ రెడ్డి, పి.వాసు, కొండా చంద్రయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అక్కురాడలో పొలంబడి

జలుమూరు ఆగస్టు 6(వార్త): జలుమూరు మండలం అక్కురాడలో మంగళవారం వ్యవసాయ అధికారులు పొలంబడి నిర్వహించారు. వెలమల రామరాజు తన పొలం 2 ఎకరాల్లో స్వర్ణ రకం బ్రీడర్ విత్తనాన్ని వరుసలలో వరి నాటు విధానంలో నాటారు. దీనిలో భాగంగా నాట్లు వేసే ముందు ఆకు కొనలు తుంచి, నారు వ్రేళ్లను సూడోమోనస్ ద్రావణంలో ముంచి నాటగా, కాండం తొలుచు పురుగు నివారణ మొదటి దశలో వచ్చే అగ్గి తెగులు, పాము పొడ తెగులు నివారించుకోవచ్చని తెలియజేశారు. పొలం గట్లపై కంది విత్తనాలు వేయాలని రైతులకు సూచించారు. బంతి నారు నాటాలని కోరారు. శిమ్మ అప్పయ్య పొలంగట్టు పైన వేసిన ఆకుకూరలు, వంగ, మునగ అరటి, ఆముదం మొదలైనవి పరిశీలించారు. కార్యక్రమంలో నరసన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రవీంద్రభారతి, జలుమూరు వ్యవసాయ అధికారి కొంకెన సురేష్, వ్యవసాయ సహాయకులు వాసుదేవరావు, నవ్య, ప్రకృతి వ్యవసాయం అమర్, రైతులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం






## వైరల్ జ్వరాలపై సమాచారమివ్వండి

**నరసన్నపేట, ఆగస్టు6 (వార్త):** వాతావరణంలో వస్తున్న మార్పులతో వైరల్ జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి శిరీష, హెల్త్ సూపర్‌వైజర్ రమణమూర్తి ఆశ వర్కర్లకు సూచించారు. మంగళవారం వారు నరసన్నపేట మండలం మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఎవరికైనా డెంగ్యూ, మలేరియా, జ్వరాలు ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

# ఓటుకు.. నోటు



* ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలకు ఎర
* ఒక్కరోజు ముందుగా ప్రచారాలు
* ఈసారి ఎలాగైనా గెలవాలనే తాపత్రయం
* ఎంత ఖర్చు చేసేందుకునైనా సిద్ధమంటున్న కొందరు అభ్యర్థులు
* ప్రెస్టేజ్ ఇష్యూ అంటూ.. కాసులు పంపిణీ
* 8న స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు

**హిరమండలం, ఆగస్టు 6 (వార్త):** నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడింది. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉమ్మడి కూటమి బలోపేతం అయ్యేందుకు గాను తొలుతగా పాఠశాల యాజమాన్య ఎన్నికలు (స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ) ఎన్నికలు నిర్వహించి అధికార పార్టీ బలాన్ని పుంజుకోవటం కోసం తాపత్రయపడుతోంది. పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే (ఎస్ఎంసీ) స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 8న ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తమయ్యింది. అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎంపికను పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా చేతులెత్తి ఎన్నుకునే విధానంలో చేపట్టనుంది. అయితే జిల్లా వ్యాప్తంగా జరిగే స్కూల్ యాజమాన్య కమిటీ ఎంపికకు జరిగే ప్రక్రియకు అధ్యక్షులుగా పోటీ చేసే అభ్యర్థి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు దారీ తీస్తున్నారు. హిరమండలంలో ఓ పంచాయతీలో ఎస్ఎంసీ అధ్యక్ష పదవికి ఒక్కో విద్యార్థి తండ్రికి రూ.2 వేలు నుంచి రూ.5 వేలు వరకూ ఇస్తున్నట్లు సమాచారం. ఎలాగైనా అధ్యక్ష పదవి పొందాలనే ఉద్దేశంతో పోటీలో గెలుపొందేందుకు అనేక ప్రలోభాలు చేపడుతున్నట్లు భోగట్టా. ఇప్పటి నుంచే అధికార పార్టీ ముందంజలో ఉండి.. స్థానిక ఎన్నికల్లో మరింత బలోపేతం అయ్యేందుకు సంబంధిత నాయకులు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు మాత్రం వీటిని చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

# రైతులకు అండగా నిలవండి

* పంట నష్టపరిహారం జమ చేయండి * బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు * జేసీకి వినతిపత్రం అందజేత



**శ్రీకాకుళం, ఆగస్టు 6 (వార్త):** రైతులను అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకోవాలని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమా మహేశ్వరరావు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కోరారు. మంగళవారం బీజేపీ నేతలతో కలిసి ఆయన జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రైతులు అన్ని విధాలుగా నష్టపోయారని, పంట పొలాలకు సాగునీరు అందకుండా పోయిందని, మేలైన విత్తనాలు ఇవ్వలేని పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే, పంట నష్టపరిహారం చెల్లించలేని దయనీయ పరిస్థితిలో అప్పటి ప్రభుత్వం ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సాగునీరు అందేలా చూశామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన పంట నష్టం లెక్కించి రైతులకు పరిహారం అందజేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో సాగునీటి కాలువలు పూడిక తీయించడం, రెండులక్షల ఎకరాలకు నీరు అందేలా చేశారన్నారు. ఇక ఎరువులు, మేలైన విత్తనాలు కొరత లేకుండా చూడాలని జేసీని కోరారు. జేసీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీపాన కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరుకోల రామారావు, కిల్లి లక్ష్మణరావు, నడుపూరు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పాడ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

### 11 నుంచి 15 వరకు 'హర్ ఘర్ తిరంగ్'



దేశంలో ప్రతి ఒక్కరూ ఈనెల 11 నుంచి 15 వరకూ హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో కన్వీనర్ సురేష్ బాబు సింగ్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించేలా కార్యకర్తలు బాధ్యత తీసుకుంటారన్నారు. ఈనెల 11 నుంచి 14 వరకూ తిరంగా యాత్ర, 12 నుంచి 14 వరకూ మన జాతీయ వీరులు విగ్రహాలు, స్మారక చిహ్నాలు చుట్టూ స్వచ్ఛ భారత్ కార్యక్రమం , 13 నుంచి 15 అమర వీరులు, సాహసవంతుల విగ్రహాలకు పూలమాలలు వేయడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఒక్కరు తల్లి పేరుతో, అమ్మకు వందనం అనే కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరిగిందన్నారు. హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని సురేష్ బాబు సింగ్ కోరారు.




## బైక్ దొంగ అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 6 (వార్త):** రిమ్స్ ఆవరణలో బైక్‌లను దొంగ తనం చేస్తున్న వ్యక్తిని ఎట్టకేలకు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ ఉమామహేశ్వరరావు తన సిబ్బందిని ఇక్కడ నిఘా ఉంచారు. మంగళవారం రిమ్స్ వద్ద కొమ్ము రాజేష్ బైక్‌ను చోరీ చేసేందుకు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి శైలిలో విచారణ చేపట్టగా గతంలో మూడు బైక్‌లను చోరీ చేసినట్టు అంగీకరించాడు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

**మందస, ఆగస్టు 6 (వార్త):** కొర్రాయిగేటు సమీపంలో హైవే పక్కన మంగళవారం షెడ్డు నిర్మాణానికి గాను వెల్డింగ్ చేస్తున్న పలాస ఉదయంపురంనకు చెందిన రాజాం కార్తీక్(23) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. వెంటనే పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువ కుడు మృతితో ఉదయపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## బోటు ప్రమాదంలో ధర్మారావు మృతి

**సోంపేట, ఆగస్టు 6 (వార్త):** రామయ్యపట్నం గ్రామానికి చెందిన వాడ ధర్మారావు(32) చెన్నైలోని బోటు ప్రమాదంలో మృతి చెందాడు. మత్స్యకారుడు ధర్మారావు ఉపాధి కోసం 15 రోజుల కిందటే చెన్నై వెళ్లాడు. మంగళవారం తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలో చేపలవేట చేస్తున్న సమయంలో కాలుజారి కిందపడి గాయాలపాలై మృతి చెందాడు. ధర్మారావుకు భార్య జానకి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ధర్మారావు మృతి విషయం తెలుసుకున్న భార్య, పిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు.

## ఎస్పీని కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ



**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు6 (వార్త):** ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా పి.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు6 (వార్త):** ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా మంగళవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వ హాస్టల్లో సమస్యల పరిష్కరించాలని, హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మటిక్ చార్జీలు, మెస్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలన్నారు. జిల్లాలో కొన్ని శతాబ్దాల కాలం నుంచి ఉంటున్న ప్రభుత్వ హాస్టళ్లు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, తక్షణమే వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్ కుక్ అటెండర్ కామాటి పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థలు పాఠశాల జూనియర్ డిగ్రీ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, జీవన్, అఖిల్, కుమార్, అనిల్, జస్వంత్ పాల్గొన్నారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413